సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
గురువారం । 20 । జూలై । 2023



చీనీ టన్ను రూ.20 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.20 వేలు పలికాయి. మార్కెట్‌కు 878 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.



కిలో టమాట @ రూ.110

అనంతపురం శివారులోని కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్టంగా రూ.110, కనిష్టంగా రూ.55 ప్రకారం పలికినట్లు అధికారులు తెలిపారు.

గరిష్టం/కనిష్టం
33.1°/21.8°

జిల్లాలో బుధవారం తుపాను వాతావరణం నెలకొంది. పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గాయి. గాలివేగం పెరిగింది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది.

న్యూస్‌రీల్

బాధ్యతలు స్వీకరించిన పొగాకు రామచంద్ర



రామచంద్రకు శుభాకాంక్షలు తెలుపుతున్న పెనుకొండకు చెందిన వాల్మీకులు

పెనుకొండ: రాష్ట్ర వాల్మీకి/బోయ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా పొగాకు రామచంద్ర బుధవారం బాధ్యతలు స్వీకరించారు. విజయవాడలోని కార్పొరేషన్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల వాల్మీకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీసీ కార్పొరేషన్ ఎండీ చంద్రశేఖరరాజు, 56 కార్పొరేషన్‌ల కోఆర్డినేటర్ ఏ. ప్రవీణ్, వాల్మీకి కార్పొరేషన్ కోఆర్డినేటర్లు, కృష్ణా, గుంటూరు జిల్లాలకు చెందిన వాల్మీకి సంఘం నాయకులు, పెనుకొండ నియోజకవర్గానికి చెందిన పలువురు నాయకులు రామచంద్రకు శుభాకాంక్షలు తెలిపారు.

వైభవంగా కుళ్లాయిస్వామి ప్రథమ దర్శనం



పీరును చూపుతున్న కొండన్న వంశీయులు

నార్పల: గూగూడు కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు కుళ్లాయిస్వామి ప్రథమ దర్శనం అంగరంగ వైభవంగా జరిగింది. మొదటగా తిరుమల కొండన్న వంశీయులు పెట్టెను కిందకు దింపి అందులోని స్వామి ప్రతిమను తీసి సుగంధ ద్రవ్యాలతో శుభ్రం చేసి కుళ్లాయిస్వామి ప్రతిమకు, అగ్ని గుండానికి ప్రత్యేక పూజలు చేశారు. కొబ్బరి దివిటీల వెలుగులో, సన్నాయి వాయిద్యాల నడుమ పట్టు వస్త్రాలు, బంగారు గొలుసుల నడుమ వారు స్వామి దర్శన భాగ్యం కల్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అనేకమంది ఇళ్లపై నుంచి స్వామి ప్రథమ దర్శనాన్ని తిలకించారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి అనుమతి

అనంతపురం: యూనివర్సిటీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి ఆర్థిక శాఖ అనుమతి ఇచ్చింది. దీంతో ఎస్కేయూలో 117, జేఎన్‌టీయూ(ఏ)లో 89 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. నాలుగు రోజుల కిందట ఎస్కేయూ, జేఎన్‌టీయూ(ఏ) పాలకమండళ్ల సమావేశం నిర్వహించారు. ఇందులో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల ఖాళీలపై చర్చించి భర్తీకి ఆమోదం తీసుకున్నారు. జాబితాను రాష్ట్ర ప్రభుత్వానికి పంపారు. మరోవైపు 2017, 2018 సంవత్సరాల్లో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్లను హైకోర్టు రద్దు చేసింది. దీంతో కొత్త నోటిఫికేషన్‌కు మార్గం సుగమమైంది.

రేపటి నుంచి ఇంటింటి ఓటరు సర్వే



వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా ఈనెల 21వ తేదీ నుంచి ఇంటింటి సర్వే పక్కాగా చేపట్టాలని కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశించారు. బుధవారం ఆయన కలెక్టరేట్ నుంచి 'స్పెషల్ సమ్మరీ రివిజన్–2023 ఫైనల్ పబ్లికేషన్'పై పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్, ఆర్డీఓలు, బీఎల్‌ఓలు, ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ఈనెల 21 నుంచి ఆగస్టు 21వ తేదీ వరకూ ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు, నూతన ఓటర్ల నమోదుపై ఇంటింటి సర్వే నిర్వహించాలన్నారు. ఇప్పటికే బూత్ లెవల్ ఆఫీసర్లకు శిక్షణ ఇచ్చామని, ఎక్కడైనా ఇవ్వకపోతే వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. ఈనెల 21న రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించి కార్యక్రమాన్ని ప్రారంభించాలన్నారు. ఈ సర్వేలో వలంటీర్లు ఎట్టి పరిస్థితుల్లోనూ పాల్గొనడానికి వీల్లేదన్నారు. మార్పులు, చేర్పుల కోసం అందిన దరఖాస్తులను సర్వేలో క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. ఫిర్యాదులు ఎంత వరకూ నిజమో జాగ్రత్తగా పరిశీలన చేయాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ కొండయ్య, కదిరి ఆర్డీఓ రాఘవేంద్ర, ఎన్నికల విభాగం డీటీ మైనుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

దుర్భిక్ష పరిస్థితులను ఎదుర్కొంటున్న పుట్టపర్తి నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేసేందుకు జగన్ సర్కార్ వేగంగా అడుగులు వేస్తోంది. ఈ ప్రాంత సాగు, తాగునీటి కష్టాలు తీర్చేందుకు కృష్ణమ్మను బీడుభూముల్లో పారించేందుకు సిద్ధమైంది. రాయలసీమ కరువు నివారణ పథకం కింద ఇప్పటికే రూ.864 కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం ...నియోజకవర్గంలోని 193 చెరువులు నింపేందుకు పనులు వేగవంతం చేసింది.

అదిగో కృష్ణమ్మ!



నల్లమాడ మండలం ఎనుములవారిపల్లి వద్ద శరవేగంగా జరుగుతున్న రిజర్వాయర్ పనులు

పుట్టపర్తి ఇక సస్యశ్యామలం
- నియోజకవర్గానికి రాయలసీమ కరువు నివారణ పథకం వర్తింపు
- 2021లోనే ఆమోదించిన రాష్ట్ర కేబినెట్
- రూ.864 కోట్లు మంజూరు చేసిన జగన్ సర్కార్
- శరవేగంగా సాగుతున్న పనులు
- భూ సేకరణకు ఈ నెల 16న నోటిఫికేషన్
- ఆనందోత్సాహాల్లో రైతన్నలు

నియోజకవర్గంలో చెరువుల వివరాలు, సాగునీరు పారే విస్తీర్ణం

మండలం	చెరువుల సంఖ్య	సాగు విస్తీర్ణం (ఎకరాల్లో)
పుట్టపర్తి	18	42,131
బుక్కపట్నం	36	35,049
కొత్తచెరువు	19	37,064
నల్లమాడ	39	43,899
ఓడీచెరువు	45	45,526
అమడగూరు	36	29,442

పుట్టపర్తి: సత్యసాయి నడయాడిన పుట్టపర్తి కేంద్రంగా శ్రీసత్యసాయి జిల్లా ప్రకటించి ఈ ప్రాంతానికి జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చిన జగన్ సర్కార్... పుట్టపర్తి నియోజకవర్గ అభివృద్ధికీ చర్యలు చేపట్టింది. స్థానిక ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి చొరవతో ఈ ప్రాంత రైతుల సాగునీటి కష్టాలు తీర్చేందుకు ప్రణాళిక రూపొందించింది. రాయలసీ కరువు నివారణ ప్రాజెక్టు కింద హంద్రీ–నీవా కాలువ ద్వారా 193 చెరువులను కృష్ణా జలాలతో నింపేందుకు 21 సెప్టెంబర్ 2021న ఏకంగా రూ.864.18 కోట్లు మంజూరు చేస్తూ జీఓ ఇచ్చింది. తాజాగా భూసేకరణకూ ఈ నెల 16న తుది నోటిఫిషన్ ఇవ్వగా పనులు వేగవంతమయ్యాయి.

ఆరు మండలాలు... మూడు టీఎంసీలు

పుట్టపర్తి నియోజకవర్గంలో ఆరు మండలాలు ఉండగా..సాగునీటి ఇబ్బందులు తీర్చేందుకు 3 టీఎంసీల నీరిచ్చేందుకు 2020లోనే సీఎం జగన్‌మోహన్ రెడ్డి అంగీకారం తెలిపారు. ఇప్పటికే బుక్కపట్నం చెరువు ఒక టీఎంసీ నీటి నిల్వ సామర్థ్యంతో అందుబాటులో ఉండగా, మారాల రిజర్వాయర్‌నూ 0.50 టీఎంసీ సామర్థ్యం మేరకు అందుబాటులోకి



చెరువులకు కృష్ణాజలాలిచ్చే అంశంపై సీఎం జగన్‌తో చర్చిస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి (ఫైల్)

తెచ్చారు. బుక్కపట్నం చెరువు, మారాల రిజర్వాయర్, కొత్తచెరువు మండలం తలమర్ల, మీర్జాపురం, మరకుంటపల్లి, లోచర్ల తదితర చెరువులను కృష్ణా జలాలతో నింపి సాగు నీరందిస్తున్నారు. తాజాగా నల్లమాడ మండలం ఎస్.ఎనుమలవారిపల్లి వద్ద సుమారు 500పై చిలుకు ఎకరాల విస్తీర్ణంలో నల్లగొండ రిజర్వాయర్ పనులు చేపడుతున్నారు. 0.50 టీఎంసీ నీటి నిల్వ సామర్థ్యం ఉన్న రిజర్వాయర్ పనులు ప్రస్తుతం వేగంగా జరుగుతున్నాయి. అలాగే పుట్టపర్తి మండలం గాజులపల్లి వద్ద 500పైచిలుకు ఎకరాల్లో మరో రిజర్వాయర్ నిర్మిస్తున్నారు. ఒక్కో రిజర్వాయర్ కింద కొత్తగా సుమారు 2,500 ఎకరాలు సాగులోకి రానున్నాయి. అలాగే నియోజకవర్గంలోని బుక్కపట్నం, కొత్తచెరువు, పుట్టపర్తి, నల్లమాడ, ఓడీచెరువు, అమడగూరు మండలాల్లోని 193 చెరువులకు కృష్ణాజలాలు చేరనున్నాయి.

మాటిచ్చారు...మేలు చేస్తున్నారు

2017 డిసెంబర్ 19న పాదయాత్రలో భాగంగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పుట్టపర్తి నియోజకవర్గంలో పర్యటించారు. అప్పుడు పుట్టపర్తి నియోజకవర్గంలో నెలకొన్న దుర్భిక్ష పరిస్థితులు, పంటలు సాగుచేసే పరిస్థితులు లేక రైతులు ఇతర రాష్ట్రాలకు వలస వెళ్తున్న విషయాలను దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి రైతులతో కలిసి జగన్‌కు వివరించారు. రైతుల కష్టాలు తీర్చేందుకు కృషి చేయాలని వినతిపత్రం సమర్పించారు. అదే రోజు బుక్కపట్నం మండలం మారాలలో నిర్వహించిన రైతు సదస్సులో, 20వ తేదీన నల్లమాడలో నిర్వహించిన బహిరంగ సభలోనూ జగన్ రైతులకు హామీ ఇచ్చారు. నియోజకవర్గంలోని 193 చెరువులను కృష్ణాజలాలతో నింపుతామన్నారు. ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి రాగానే చర్యలు చేపట్టారు. స్థానిక ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి చొరవతో 2021లో నియోజకవర్గానికి రాయలసీమ కరువు నివారణ ప్రాజెక్టు వర్తింపజేశారు. నియోజకవర్గంలోని 6 మండలాల పరిధిలోని 193 చెరువులను కృష్ణా జలాలతో నింపేందుకు రూ.864 కోట్లు మంజూరు చేశారు.

9.7.2021
కరువు నివారణ పథకం మంజూరు

రూ.864.18 కోట్లు
ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు

193
కృష్ణాజలాలతో నింపనున్న చెరువులు

2,33,111
సాగులోకి రానున్న భూమి (ఎకరాల్లో)

నా జీవితంలో మరచి పోలేని ఘట్టం



రాయలసీమ కరువు నివారణ ప్రాజెక్టు కింద పుట్టపర్తి నియోజకవర్గానికి సాగు, తాగునీటి సరఫరా కోసం రూ.864 కోట్లతో పనులు చేపట్టడం సంతోషంగా ఉంది. ఇది నా జీవితంలో మరచిపోలేని మధురమైన ఘట్టం. ఇందుకు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు. 2019 సెప్టెంబర్‌లోనే సీఎం జగన్‌ను కలిసి నియోజకవర్గంలోని 193 చెరువులు నింపాలని కోరా. జగన్ సానుకూలంగా స్పందించి నిధులు కేటాయించారు. దివంగత నేత వైఎస్సార్ 2007లో హంద్రీ–నీవా కాలువ ద్వారా కృష్ణా జలాలు తీసుకొచ్చేందుకు విశేషంగా కృషి చేశారు. వైఎస్సార్ కలను సీఎం జగన్ నెరవేర్చారు. త్వరలోనే సీఎం జగన్ చేతుల మీదుగా ఎత్తిపోతల పథకం ప్రారంభోత్సవం చేయిస్తా. 193 చెరువులు నింపితే ప్రత్యక్షంగా పరోక్షంగా 2 లక్షలకుపైగా ఎకరాలు సాగులోకి వస్తాయి.

– దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, ఎమ్మెల్యే, పుట్టపర్తి

సాగు, తాగునీటి ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం

నియోజకవర్గంలోని 193 చెరువులు కృష్ణా జలాలలో నింపితే ప్రత్యక్షంగా, పరోక్షంగా 2,33,111 ఎకరాల భూములు సాగులోకి రానున్నాయి. అలాగే 2 లక్షల మందికిపైగా తాగునీటి ఇబ్బందులు తప్పుతాయి. ప్రస్తుతం ఈ పనులు ముమ్మరం కాగా, రైతుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. త్వరలోనే ఈ ప్రాంతం కోనసీమను తలపించే విధంగా సస్యశ్యామలం కానుంది.

ఆర్టీసీలో హర్షాతిరేకాలు

- 'అధిక పింఛన్'తో ఉద్యోగుల సంబరాలు
- సీఎం జగన్ చిత్రపటాలకు క్షీరాభిషేకాలు
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 4,500 మందికి లబ్ధి



పుట్టపర్తిలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

అనంతపురం సెంట్రల్: ఏపీఎస్ ఆర్టీసీ ఉద్యోగుల సంబరాలు మిన్నంటాయి. అధిక పింఛన్ (హయ్యర్ పెన్షన్) నమోదుకు ప్రభుత్వం అవకాశం కల్పించడంతో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఈ మేరకు బుధవారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆర్టీసీ ఉద్యోగులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. సీఎం జగన్ మొదట్నుంచీ ఏపీఎస్ఆర్టీసీ ఉద్యోగులకు వరాల జల్లు కురిపిస్తున్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి చరిత్రలో నిలిచిపోయారు. 2016 నుంచి ఆగిపోయిన కారుణ్య నియామకాలను కొనసాగించి బాధిత కుటుంబాలకు అండగా నిలిచారు. తాజాగా దేశంలోని ఏ రాష్ట్రంలోనూ చేయని విధంగా అధిక పింఛన్ నమోదుకు అవకాశం కల్పించారు. దీనివల్ల ఉమ్మడి జిల్లాలో దాదాపు 4,500 మంది ఆర్టీసీ ఉద్యోగులకు లబ్ధి కలగనుంది. ఇందులో అనంతపురం జిల్లాలో సుమారు 2,300, శ్రీసత్యసాయి జిల్లాలో 2,200 మంది ఉద్యోగులు ఉన్నారు.

పదింతల పెన్షన్

రెండు రోజుల క్రితం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ స్థాయి అధికారి పదవీవిరమణ పొందగా ఉద్యోగుల భవిష్య నిధి (ఈపీఎఫ్ఓ) ద్వారా రూ.80 వేల పింఛన్ వర్తించింది. గతంలో రూ.8 వేల నుంచి రూ.10 వేలు మాత్రమే పింఛన్ వచ్చేదని అధికారులు తెలిపారు. అలాగే రెండేళ్ల తర్వాత జూనియర్ అసిస్టెంట్ కేడర్ (కండక్టర్) ఉద్యోగులు పదవీవిరమణ పొందితే రూ.25 వేలు, ఆపైన పింఛన్ వస్తుందని పేర్కొన్నారు. సీపీఎస్ కన్నా పదింతలు, ఓల్డ్ పెన్షన్ స్కీము (ఓపీఎస్) కన్నా మేలైన పింఛన్ విధానాన్ని ఆర్టీసీ ఉద్యోగులకు తీసుకొచ్చారని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇక ఆర్టీసీలో కారుణ్య నియామకాలను 2016 నుంచి అప్పటి టీడీపీ ప్రభుత్వం నిలుపుదల చేసింది. కానీ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే మళ్లీ కొనసాగిస్తూ ఉత్తర్వులిచ్చింది. దీనివల్ల ఉమ్మడి జిల్లాలో ఆర్టీసీకి సంబంధించి ఇప్పటికే 33 మంది ఇతర ప్రభుత్వ శాఖల్లో, మరో 45 మంది ఆర్టీసీలోనే ఉద్యోగాలు పొందారు.

కాకి లెక్కలు చెప్పొద్దు

- స్కూల్లో ఎంత మంది ఉండేది తెలియదా?
- గోరంట్ల జెడ్పీ బాలుర హైస్కూల్ హెచ్‌ఎంపై కలెక్టర్ ఆగ్రహం



గోరంట్ల బాలుర ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

గోరంట్ల: ''పాఠశాలలో ఎంత మంది విద్యార్థులున్నారో కూడా తెలియదా...?అడిగితే కాకిలెక్కలు చెబుతారా...? జగనన్న విద్యాకానుక కిట్లు ఇచ్చామంటున్నారు..మరి బయోమెట్రిక్ ఎందుకని వేయించలేదు...పైగా వలస వెళ్లారని అబద్ధం చెబుతారా'' అని గోరంట్ల బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోపాల్‌పై కలెక్టర్ అరుణ్ బాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం కలెక్టర్ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అదే సమయంలో విద్యార్థులంతా మధ్యాహ్న భోజనం చేస్తుండగా...నేరుగా అక్కడికే వెళ్లి భోజనం నాణ్యతను పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం అందుతుందా... రోజూ కోడిగుడ్డు, చిక్కీ ఇస్తున్నారా...? అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

లెక్కలు నేర్చుకోవాలని చురక

పాఠశాలలో విద్యార్థులు ఎంత మంది ఉన్నారు... ఎంత మందికి 'జగనన్న అమ్మఒడి' వర్తించింది... విద్యాకానుక కిట్లు ఎంత మందికి ఇచ్చారని ప్రధానోపాధ్యాయుడు గోపాల్‌ను కలెక్టర్ ప్రశ్నించారు. పాఠశాలలో 494 మంది ఉన్నారని, అందరికీ జగనన్న విద్యాకానుక కిట్లు ఇచ్చామని, 437 మంది వేలిముద్ర వేశారని తెలిపారు. మిగతావారి బయోమెట్రిక్ ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించగా.. కొందరు టీసీలు తీసుకువెళ్లారని, మరికొందరు తల్లిదండ్రులతో కలిసి వలస వెళ్లారని చెప్పారు. దీంతో అక్కడే ఉన్న మండల విద్యాధికారి ఎం.గోపాల్ కల్పించుకుని పాఠశాలలో 474 మంది విద్యార్థులున్నారని, 437 మంది విద్యార్థులకు విద్యాకానుక కిట్లు అందజేసినట్లు వివరించారు. దీంతో కలెక్టర్ అరుణ్‌బాబు ప్రధానోపాధ్యాయుడు గోపాల్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ''కాకి లెక్కలు చెప్తున్నావ్ జాగ్రత్త...ముందు మీరు లెక్కలు నేర్చుకోండి'' అన్నారు. అనంతరం కలెక్టర్ ఉపాధ్యాయుల హాజరు పట్టికతో పాటు విద్యాకానుక కిట్ల పంపిణీకి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు స్థానికులు చైతన్య ప్రైవేట్ పాఠశాల నిర్వాహకులు అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని, కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా, చర్యలు తీసుకోవాలని డీఈఓ మీనాక్షిని ఆదేశించారు.

బెస్ట్ యూనివర్సిటీ సందర్శన

కమ్మలవాండ్లపల్లి సమీపంలోని బెస్ట్ యూనివర్సిటీని కలెక్టర్ సందర్శించారు. యాజమాన్యం విజ్ఞప్తి మేరకు వర్సిటీకోసం రెవెన్యూ అధికారులు గుర్తించిన 28 ఎకరాలపైచిలుకు భూమిని బుధవారం కలెక్టర్ పరిశీలించారు. స్థానిక రెవెన్యూ అధికారులతో వివరాలు ఆరా తీశారు.

నేతన్నకు జగనన్నే అండ

- 21న ఐదో విడత 'నేతన్న నేస్తం' విడుదల
- సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ ఎమ్మెల్యే కేతిరెడ్డి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ
- ర్యాలీలో ఉత్సాహంగా పాల్గొన్న చేనేత కార్మికులు



బహిరంగ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి, ర్యాలీలో పాల్గొన్న చేనేత కార్మికులు

ధర్మవరం: చేనేత రంగానికి చేయూతనివ్వడంతో పాటు నేతన్నకు జగనన్నే కొండంత అండగా నిలిచారని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి అన్నారు. ముఖ్యంగా చేనేతల కోసం ప్రవేశపెట్టిన 'నేతన్న నేస్తం' చరిత్రాత్మక పథకమన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ఏటా ఒక్కో చేనేత కార్మికుని ఖాతాలో రూ.24 వేలు జమ చేస్తున్నారన్నారు. ఈ నెల 21న 'నేతన్న నేస్తం' ఐదో విడత నిధులు విడుదల చేయనుండగా, సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ బుధవారం ధర్మవరంలో చేనేతలు ఎమ్మెల్యే కేతిరెడ్డితో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహం వద్ద ప్రారంభమైన ర్యాలీ కాలేజ్ సర్కిల్, కళాజ్యోతి సర్కిల్, పీఆర్‌టీ, అంజుమన్ సర్కిల్, తేరుబజార్ మీదుగా కదిరిగేట్ వద్ద ఉన్న నేతన్న విగ్రహం వరకు సాగింది. ర్యాలీలో చేనేతలు 'జై జగన్' అంటూ నినాదాలు హోరెత్తించగా, ధర్మవరం ప్రతిధ్వనించింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేతిరెడ్డి నేతన్న విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడారు.

జగనన్న చెప్పాడంటే...చేస్తాడంతే

వైఎస్ జగన్ మాట ఇచ్చాడంటే తప్పనిసరిగా చేస్తాడని ఎమ్మెల్యే కేతిరెడ్డి తెలిపారు. 2009లో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే ముడిపట్టు రాయితీ పథకాన్ని తీసుకువచ్చి ప్రతి చేనేత కార్మికుడికీ ప్రతినెలా రూ.600 వచ్చేలా చేశామన్నారు. అయితే 2014లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ప్రభుత్వం ఆ పథకాన్ని నిర్వీర్యం చేసిందన్నారు. ఈ క్రమంలోనే చేనేతల ముడిపట్టు బకాయిలు అందించాలని చేనేతలతో కలసి తాను ధర్మవరంలో 37రోజుల పాటు నిరాహార దీక్షలు చేస్తే అప్పటి ప్రతిపక్షనేత హోదాలో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ధర్మవరానికి వచ్చి చేనేతలను పరామర్శించారని గుర్తుచేశారు. ఈ సందర్భంలోనే వైఎస్సార్ సీపీ అధికారంలోకి రాగానే ముడిపట్టు రాయితీ ప్రతినెలా రూ.2 వేలు ఇస్తామని జగన్ హామీ ఇచ్చారన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ప్రతి నెలా కాకుండా ఒకేసారి 'నేతన్న నేస్తం' పథకం ద్వారా ఏటా రూ.24 వేలు చేనేత కార్మికుల ఖాతాల్లో జమ చేస్తున్నారన్నారు. 2019 డిసెంబర్‌లో జగనన్న పుట్టిన రోజు సందర్భంగా ధర్మవరంలోనే ఈ పథకం ప్రారంభించారన్నారు. కరోనా వంటి కష్టకాలంలోనూ సాయం అందించారన్నారు. ఈ పథకం ద్వారా జిల్లాలో 15 వేల మందికిపైగా లబ్ధి చేకూరుతోందన్నారు. నేతన్న నేస్తం ఐదో విడత నిధులు ఈనెల 21న సీఎం జగనన్న బటన్‌నొక్కి విడుదల చేస్తారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి, వైస్ చైర్మన్ వేముల జయరామిరెడ్డి, వైఎస్సార్ సీపీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు జింకా కంబగిరి, పట్టణ సచివాలయాల కన్వీనర్లు చందమూరి నారాయణరెడ్డి, మాసపల్లి సాయి కుమార్, 40 వార్డుల కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, చేనేత నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలు పాటించండి



మాట్లాడుతున్న ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సంపత్‌కుమార్

పుట్టపర్తి అర్బన్: ఖరీఫ్‌లో రైతులు చేపట్టిన వేరుశనగ పంట సాగులో దిగుబడి పెంచేలా వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలు, సలహాలు పాటించాలని రైతులకు కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సంపత్‌కుమార్ సూచించారు. పుట్టపర్తి మండలం చెర్లోపల్లిలో కేవీకే, డ్వామా సంయుక్తంగా రైతులకు శిక్షణా తరగతులకు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి బుధవారం డాక్టర్ సంపత్‌కుమార్ హాజరై వేరుశనగ, వరి, కంది, మామిడి పంటలకు వ్యాప్తిస్తున్న వ్యాధులు, సాగులో ఎదురవుతున్న సమస్యలపై ఆరా తీశారు. అనంతరం పంటల సాగులో చేపట్టాల్సిన చర్యలను వివరించారు. తెగుళ్ల నివారణకు జీవ రసాయనాలను ఉపయోగించాలన్నారు. కదిరి వ్యవసాయ పరిశోధనా స్థానంలో రూపుదిద్దుకుంటున్న వేరుశనగ రకాలు అత్యధిక దిగుబడితో పాటు బెట్టను తట్టుకోగలగడం విశేషమన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ మల్లీశ్వరి, డాక్టర్ వేమన, డాక్టర్ చంద్రాయుడు, డాక్టర్ కిషోర్ రెడ్డి, చందన, టెక్నికల్ అసిస్టెంట్ భాస్కర్ రైతులు పాల్గొన్నారు.

కంకర అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు

- కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: కంకర, మట్టి అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని సంబంధి అధికారులను కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశించారు. మైన్స్ శాఖ కార్యకలాపాలపై కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో బుధవారం ఆయన సమీక్షించారు. అక్రమంగా కంకర, మట్టి రవాణ ఎక్కడ జరిగినా ఉపేక్షించరాదన్నారు. అక్రమ తవ్వకాలు, రవాణాపై తహసీల్దార్, పోలీస్, మైన్స్ అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. మడకశిర, ముదిగుబ్బ, బత్తలపల్లి, ధర్మవరం తదితర ప్రాంతాల్లో అసాంఘిక కార్యకలాపాలు ఎక్కువ అయ్యాయన్నారు. క్షేత్రస్థాయిలో పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉండి పట్టుబడితే కేసులు నమోదు చేయడంతో పాటు వాహనాలు సీజ్ చేయాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ కొండయ్య, కదిరి ఆర్డీఓ రాఘవేంద్ర, మైన్స్ జిల్లా అధికారి రామమోహన్‌రావు, ఎస్‌బీ డీఎస్పీ వాసుదేవన్, మైనింగ్ జిల్లా విజిలెన్స్ అధికారి విజయలక్ష్మి, హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ డివిజన్ ఏఈఈ కైలాస్‌కుమార్ రాజు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

రైతులకు విస్తృత ప్రయోజనాలు చేకూరాలి

- జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాల్లో సభ్యులు
- గురుకులాల్లో సీట్లు అమ్ముకోవడంపై ఆగ్రహం



మాట్లాడుతున్న గుమ్మఘట్ట జెడ్పీటీసీ సభ్యుడు మహేష్

అనంతపురం సిటీ: ఖరీఫ్ సీజన్ కావడంతో రైతులకు విస్తృత ప్రయోజనాలు కలిగే అంశాలపై దృష్టి పెట్టాలని వ్యవసాయ శాఖ అధికారులను జెడ్పీ స్థాయీ సంఘం సభ్యులు కోరారు. జెడ్పీ స్థాయీ సంఘాలు-1, 2, 4, 7(ప్రణాళిక, ఆర్థిక/గ్రామీణాభివృద్ధి/విద్య, వైద్యం/ఇంజినీరింగ్ శాఖల) సమావేశాలు జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ అధ్యక్షతన స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయ ప్రధాన సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించారు. స్థాయీ సంఘం-3(వ్యవసాయ, అనుబంధ శాఖలు) సమావేశం జెడ్పీ వైస్ చైర్మన్ తాడిమర్రి సుధాకర్‌రెడ్డి అధ్యక్షతన జరగ్గా, స్థాయీ సంఘం-5 సమావేశం ఆ విభాగం చైర్‌పర్సన్ హెచ్.హసీనా బాను(డి.హీరేహాళ్ జెడ్పీటీసీ) అధ్యక్షతన నిర్వహించారు. స్థాయీ సంఘం-6(సాంఘిక సంక్షేమ శాఖలు) సమావేశం జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ వి.నాగరత్నమ్మ(జెడ్పీటీసీ-నార్పల) అధ్యక్షతన కొనసాగాయి. సీఈఓ భాస్కర్‌రెడ్డి, ఏఓ తిప్పయ్య, వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు. వ్యవసాయ శాఖపై చర్చ సందర్భంగా పరిగి జెడ్పీటీసీ రామప్ప మాట్లాడుతూ.. టీడీపీ హయాంలో ఇచ్చిన రెయిన్‌గన్లు, స్ప్రింక్లర్లు, ఇతర వ్యవసాయ పరికరాలను స్వాధీనం చేసుకుని వాటిని రైతులకు అందజేయాలని కోరారు. వర్షాభావ పరిస్థితులు వెంటాడుతున్నాయని, సకాలంలో వేరుశనగ విత్తనం వేయలేకపోతున్నారని, ప్రత్యామ్నాయ పంటల గురించి రైతులకు వివరించి, ఆ దిశగా వారిని ప్రోత్సహించాలని సభ్యులు కోరారు. ఆగస్టు 5 వరకు విత్తనాలు విత్తుకోవచ్చని, లేదంటే ప్రత్యామ్నాయ పంటలకు ప్రాధాన్యం ఇవ్వాలని వ్యవసాయ శాఖ జిల్లా అధికారిణి ఉమామహేశ్వరమ్మ తెలిపారు. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టనున్న పనులకు సంబంధించి ఎస్టిమేషన్లు తయారు చేసి ఇవ్వాలని ఆ శాఖ ఎస్‌ఈ గోపాల్‌రెడ్డిని కోరినా పట్టించుకోవడం లేదని, ఇంత నిర్లక్ష్యమైతే ఎలాగని లేపాక్షి జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి ప్రశ్నించారు. కొన్ని పంచాయతీల్లో కార్యదర్శులు భారీగా అక్రమాలకు పాల్పడుతున్నారని, అటువంటి వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని డీపీఓ ప్రభాకర్‌రావును సభ్యులు కోరారు.

- అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ అధ్వానంగా మారడంపై ఐసీడీఎస్ విభాగం చైర్‌పర్సన్ హసీనా, జెడ్పీటీసీ సభ్యులు కవిత(అమడగూరు), మమత(బెళుగుప్ప), చంద్ర(అనంతపురం రూరల్) ఆగ్రహం వ్యక్తం చేశారు. చాలీ చాలని అద్దె భవనాల్లో కేంద్రాలు నిర్వహిస్తుండడంతో పిల్లలు అసౌకర్యానికి గురవుతున్నారన్నారు.
- వెంటనే చర్యలు తీసుకోవాలని రెండు జిల్లాల పీడీలు లక్ష్మీకుమారి, శ్రీదేవిని కోరారు. నిర్మాణాలు పూర్తయిన అంగన్‌వాడీ భవనాలను తక్షణం స్వాధీనం చేయాలని యల్లనూరు జెడ్పీటీసీ సభ్యుడు విజయప్రతాపరెడ్డి కోరారు.
- డ్వాక్రా సంఘాల సొమ్మును కొందరు మింగేస్తున్నారని బుక్కరాయసముద్రం జెడ్పీటీసీ భాస్కర్ ఆరోపించారు. ఆధారాలతో సహా ఏపీఎంకు ఫిర్యాదు చేసినా కనీస స్పందన లేదని మండిపడ్డారు.
- గ్రామాల్లో వ్యవసాయం కోసం ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతే వాటిని మార్చేందుకు రైతుల నుంచి ట్రాన్స్‌కో సిబ్బంది రూ.50 వేల వరకు అక్రమంగా వసూలు చేస్తున్నారని గుమ్మఘట్ట జెడ్పీటీసీ మహేష్ ఆరోపించారు. అటువంటి వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

గురుకులాల్లో సీట్లు అమ్ముకుంటారా?

విద్యా శాఖకు సంబంధించిన అంశంపై చర్చ ప్రారంభించగా.. మహాత్మాజ్యోతిబా పూలే గురుకులాల శ్రీసత్యసాయి జిల్లా కన్వీనర్ వ్యవహారశైలిని సభ్యులందరూ తప్పుబట్టారు. అమ్మానాన్నలను కోల్పోయిన పిల్లలకు మానవతా దృక్పథంతో గురుకులాల్లో సీట్లు ఇమ్మని అడిగితే కన్వీనర్ స్పందించకపోగా ప్రజాప్రతినిధులతో వ్యంగ్యంగా, దురుసుగా మాట్లాడుతున్నారని మూకుమ్మడిగా ధ్వజమెత్తారు. రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకు సీట్లు అమ్ముకోవడం దుర్మార్గమని జెడ్పీటీసీ సభ్యులు చంద్రకుమార్(అనంతపురం రూరల్), రాధ(కదిరి), అశ్విని(కూడేరు), మమత(బెళుగుప్ప), భాస్కర్ (బుక్కరాయసముద్రం), మహేశ్ (గుమ్మఘట్ట) తదితరులు మండిపడ్డారు. సీట్ల గురించి అడిగితే మీ జిల్లా వేరు.. మా జిల్లా వేరంటూ మాట్లాడుతున్నారని, ప్రాంతాల వారీగా విభజించి మాట్లాడితే ఊరుకునేది లేదని తేల్చి చెప్పారు. అయితే సమాధానం చెప్పాల్సిన కన్వీనర్, డీసీఓ ఇద్దరూ గైర్హాజరు కావడంపై అసహనం వ్యక్తం చేశారు.

పేరూరు డ్యాంను పరిశీలించిన జపాన్ ప్రతినిధులు



పేరూరు డ్యాంను పరిశీలిస్తున్న జపాన్ ప్రతినిధులతో స్థానిక అధికారులు

రామగిరి: మండలంలోని అప్పర్ పెన్నార్ ప్రాజెక్ట్ (పేరూరు డ్యాం)ను బుధవారం జపాన్ ప్రతినిధులు పరిశీలించారు. పేరూరు డ్యాం మరమ్మతులకు రూ.17.37 కోట్లు జైకా నిధులు మంజూరైన విషయం తెలిసిందే. ఈ క్రమంలో బుధవారం జపాన్‌కు చెందిన ప్రతినిధులు డ్యాంను సందర్శించి ఏయే పనులు చేపట్టారు. ఎంత మేరకు పూర్తి చేశారు అనే అంశాలను పరిశీలించారు. కాలువ మరమ్మతులు, లైనింగ్ పనులు, డ్యాం గేట్ల మరమ్మతు పనులతో పాటు ఇతర పనులకు ఇప్పటి వరకూ రూ.10 కోట్ల నిధులు ఖర్చు చేసినట్లు అధికారులు తెలిపారు. గత జనవరిలో అధిక వర్షాలు కురవడంతో డ్యాం గేట్లను మూడు నెలల పాటు ఎత్తి వర్షపు నీటిని దిగువకు వదలినట్లు వివరించారు. త్వరలో మిగిలిన పనులు వెంటనే పూర్తి చేయాలని జపాన్ బృందం సూచించింది. కార్యక్రమంలో స్పెషల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ రాఘవయ్య, ఇరిగేషన్ ఎస్‌ఈ శ్రీనివాసరెడ్డి, డీఈ వెంకటరమణ, ఏఈలు బాలరంగారెడ్డి, మురళి తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దారుకు టోకరా!

చిలమత్తూరు: డీఎస్పీ పేరుతో ఏకంగా తహసీల్దార్‌ను బురిడీ కొట్టించడమే కాక, ప్రజలను ఓ సైబర్ నేరగాడు వంచించి నగదు బదిలీ చేయించుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. చిలమత్తూరు మండలం పాతచామలపల్లికి చెందిన శంకర్‌రెడ్డి, మధు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఈ విషయాన్ని పసిగట్టిన సైబర్ నేరగాడు. బుధవారం తహసీల్దార్ నాగరాజుకు ఫోన్ చేసి, తాను డీఎస్పీని మాట్లాడుతున్నానని తెలిపాడు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబసభ్యుల ఆధార్ కార్డు, బ్యాంక్ పాసు పుస్తకం తెప్పించి తనకు పంపాలని నమ్మబలికాడు. అవతలి వ్యక్తి మాటలు నమ్మిన తహసీల్దార్ వెంటనే వీఆర్వో జ్యోతికి పురమాయించి, బాధితుల ఆధార్ కార్డులు, బ్యాంక్ పాసుపుస్తకాలు తెప్పించుకుని, తనకు ఫోన్ చేసిన వ్యక్తి వాట్సాప్ నంబర్‌కు పంపారు. కాసేపటి తర్వాత మృతుడి కుటుంబసభ్యులకు 96063 15097 నంబర్ నుంచి కాల్ వచ్చింది. మృతులకు సంబంధించి పరిహారం మంజూరైందని, తనకు ఖర్చులకు గాను కాస్త డబ్బు ఇస్తే ఆ మొత్తాన్ని పంపుతానని నమ్మబలికాడు. దీంతో ఒకరి వద్ద నుంచి రూ.16,470, మరొకరి వద్ద నుంచి రూ.16,500ను ఫోన్‌పే ద్వారా తన ఖాతాకు బదిలీ చేయించుకుని సెల్‌ఫోన్ స్విచ్ఛాప్ చేశాడు. ఎన్నిసార్లు ఫోన్ చేసినా స్పందన లేకపోవడంతో బాధితుడు శివప్పకు అనుమానం వచ్చి తహసీల్దార్ నాగరాజును కలసి విషయం తెలిపాడు. దీంతో చేతులెత్తేసినా పోలీసులకు ఫిర్యాదు చేయాలని సలహా ఇచ్చారు. దీంతో బాధితులు ఫిర్యాదు చేయడంతో ఎస్‌ఐ శ్రీనివాసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

'నాడు-నేడు' పనుల్లో అక్రమాలు సహించం



సమీక్షలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ చేతన్

పుట్టపర్తి అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రెండో దశ 'నాడు-నేడు' పనులు నాణ్యతతో చేయాలని, ఇందులో అక్రమాలకు పాల్పడితే సహించే ప్రసక్తే లేదని జాయింట్ కలెక్టర్ చేతన్ హెచ్చరించారు. బుధవారం ఆయన కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఏఈలు, ఫీల్డ్ ఇంజినీర్లు, ఎంఈఓలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, కళాశాలల్లో చేపట్టిన రెండోదశ 'నాడు-నేడు' పనుల కోసం ప్రభుత్వం రూ.వేల కోట్లు ఖర్చు చేస్తోందన్నారు. అందువల్ల అధికారులంతా బాధ్యతతో పనిచేయాలన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో వసతులు కల్పన, తరగతి గదుల నిర్మాణం, అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్తి స్థాయి మరమ్మత్తులు, తాత్కాలిక మరమ్మత్తులు చేపట్టాలన్నారు. రక్షిత తాగునీటి వసతి, బాలురు, బాలికలకు వేర్వేరుగా మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యం, ఇంగ్లిష్ ల్యాబ్‌లు, గదుల్లో ఫర్నీచర్, గ్రీన్ బోర్డులు, భవనాలకు పెయింటింగ్, ప్రహరీ నిర్మాణం తదితర అంశాలపై సమీక్షించారు. రెండో దశలో జిల్లాలోని 1,081 పాఠశాలలను ఎంపిక చేయగా, ప్రస్తుతం 631 పాఠశాలల్లో పనులు జరుగుతున్నాయన్నారు. మడకశిర, రొళ్ల, అమరాపురం, గోరంట్ల, పెనుకొండ, హిందూపురం అర్బన్, చిలమత్తూరు, బుక్కపట్నం, ధర్మవరం అర్బన్ ప్రాంతాలు వెనుకబడి ఉన్నాయని, ఆయా ప్రాంతాల అధికారులు తగు చర్యలు తీసుకుని పురోగతి చూపాలన్నారు. నాడు-నేడు పనులకు ఇసుక, సిమెంట్ కొరత లేకుండా చూడాలని ఇంజినీర్లను ఆదేశించారు. పనుల వివరాలను ఎప్పటికప్పుడు అధికారులు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ప్రతి వారం పురోగతి కనిపించేలా ఫొటోలు తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఎక్కడైనా ఏజెన్సీలు పని చేయకుంటే తొలగించి నూతన ఏజెన్సీలకు పని అప్పగించాలన్నారు. కార్యక్రమంలో డీఈఓ మీనాక్షి, ఇంజినీర్లు అన్వర్ బాషా, వెంకటరమణ, గంగాధర్, జయచంద్రారెడ్డి, ఎంఈఓలు, ఫీల్డ్ ఇంజినీర్లు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాగ్రామంగా 'మడకశిర'

- ఆర్.అనంతపురంలో స్పోర్ట్స్ సెంటర్ ఏర్పాటు
- ఆర్డీటీ సేవలు కొనియాడిన ఎమ్మెల్యే తిప్పేస్వామి
- ఆర్డీటీ ప్రోగ్రామ్ డైరెక్టర్ మాంఛోఫెర్రర్‌కు ఘన సన్మానం



క్రికెట్ నెట్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి, మాంఛోఫెర్రర్

మడకశిర: జిల్లాలోనే వెనుకబడిన మడకశిరను క్రీడాగ్రామంగా తీర్చిదిద్దేందుకు ముందుకు వచ్చిన ఆర్డీటీ సేవలు మరువలేనివని మడకశిర ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో ఆర్డీటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రికెట్ నెట్స్‌ను ఆ సంస్థ ప్రోగ్రామ్‌డైరెక్టర్ మాంఛోఫెర్రర్‌తో కలసి బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాంఛో ఫెర్రర్ మాట్లాడుతూ.. మడకశిర ప్రాంతంలో క్రీడల అభివృద్ధికి ఆర్డీటీ పూర్తి సహకారం ఉంటుందన్నారు. పట్టణ సమీపంలోని ఆర్.అనంతపురంలో ఉన్న ఆర్డీటీ కార్యాలయ ఆవరణను క్రీడాగ్రామంగా తీర్చిదిద్దుతామన్నారు. ఫుట్‌బాల్, వాలీబాల్, కబడ్డీ క్రీడలపై శిక్షణ ఇస్తామన్నారు. తర్వాతి రోజుల్లో అన్ని రకాల క్రీడల శిక్షణకు కృషి చేస్తామన్నారు. ఎమ్మెల్యే తిప్పేస్వామి అభ్యర్థన మేరకు మడకశిర ప్రాంత అభివృద్ధికి తన వంతు సహకారాన్ని అందిస్తానన్నారు.

పేదలకు అండగా ఆర్డీటీ

ఎమ్మెల్యే తిప్పేస్వామి మాట్లాడుతూ... కరువు జిల్లాలో పేదలకు అన్ని విధాలుగా ఆర్డీటీ అండగా నిలిచిందన్నారు. ప్రధానంగా పేదల అభ్యున్నతికి డాక్టర్ విన్సెంట్ ఫెర్రర్ చేసిన కృషిని కొనియాడారు. గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు పక్కా గృహాలు నిర్మించి ఇవ్వడం మొదలు.. విద్య, వైద్యం, క్రీడలు తదితర రంగాల అభివృద్ధికి అనేక కార్యక్రమాలు చేపట్టడంపై హర్షం వ్యక్తం చేశారు. డాక్టర్ విన్సెంట్ ఫెర్రర్ అడుగుజాడల్లోనే ఆయన తనయుడు మాంఛోఫెర్రర్ నడుస్తూ పేదల పాలిట పెన్నిధిగా నిలుస్తున్నారన్నారు. క్రికెట్ నెట్స్ ఏర్పాటుకు సహకారం అందించిన మాంఛో ఫెర్రర్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మడకశిర క్రికెట్ అసోసియేషన్ సభ్యులు నాగేంద్ర, సాయి, మోహన్, డాక్టర్ రవి, సీనియర్ న్యాయవాది శివలింగేగౌడ్, ఎస్‌ఐ ఇషాక్ బాషా తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' కూలీల సంఖ్య పెరగాలి

- డ్వామా పీడీ రామాంజనేయులు



మామిడి మొక్కలను పరిశీలిస్తున్న పీడీ రామాంజనేయులు

నల్లమాడ: ఉపాధి పనుల్లో పాలుపంచుకునే కూలీల సంఖ్య మరింత పెరగాలని సంబంధిత సిబ్బందిని డ్వామా పీడీ రామాంజనేయులు ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ కూలీలు అధికంగా పనుల్లో పాల్గొనేలా వారిలో చైతన్యం తీసుకురావాలని సూచించారు. మండలంలోని నల్లసింగయ్యగారిపల్లి వద్ద డ్రైల్యాండ్ హార్టీకల్చర్ కింద చేపట్టిన మామిడి మొక్కల పెంపకాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ప్రస్తుతం వర్షాలు ఆలస్యమై వ్యవసాయ పనులు తగ్గాయని, దీంతో కూలీలకు 'ఉపాధి' పనులు విరివిగా కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏపీడీ శ్రీనివాసరెడ్డి, ఏపీఓ సూర్యనారాయణ, ఈసీ షెక్షా, సాంకేతిక సహాయకుడు సాయినాథరెడ్డి, క్షేత్ర సహాయకుడు భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

అమృత్ సరోవర్ పనులు ఉపయోగకరం

అమడగూరు: ప్రభుత్వం ఉపాధి కూలీల లబ్ధి కోసం చేపట్టిన అమృత్ సరోవర్ పనులు ఎంతో ఉపయోగకరమని డ్వామా పీడీ రామాంజినేయులు అన్నారు. బుధవారం ఆయన ఓడీరువు మండలం నల్లగుట్లపల్లిలో చేపట్టిన అమృత్ సరోవర్ పనులు పరిశీలించారు. అనంతరం డ్రైల్యాండ్ హార్టీకల్చర్ కింద మంజూరైన పండ్ల మొక్కలను గ్రామానికి చెందిన నారాయణరెడ్డి పొలంలో నాటించారు. ఐదెకరాల్లోపు ఉన్న రైతులకు మొక్కలతో పాటు మూడేళ్ల పాటు నిర్వహణ ఖర్చులను ప్రభుత్వం అందజేస్తోందన్నారు. ఈ సౌలభ్యాన్ని అర్హులైన రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు

మా ఊరికి బస్సొచ్చింది!

- తొలిసారి సుద్దకుంటపల్లికి వచ్చిన ఆర్టీసీ బస్సు
- సీఎం కార్యాలయ చొరవతో నెరవేరిన దశాబ్దాల కల



తమ గ్రామానికి వచ్చిన బస్సు ముందు సుద్దకుంటపల్లి గ్రామస్తుల ఆనందోత్సాహాలు

రామగిరి: ఆర్టీసీ బస్సు పట్నం వెళ్లాలనేది ఆ గ్రామ ప్రజల దశాబ్దాల కల. నాయకులు, అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోయింది. అత్యవసర సమయంలో ఆటోలోనో లేక బైక్ పైనో వెళ్లాల్సి వచ్చేది. గర్భిణులు, బాలింతల పరిస్థితి దయనీయంగా ఉండేది. ఈ పరిస్థితుల్లో గ్రామానికి చెందిన యువకుడు సీఎం కార్యాలయాన్ని సంప్రదించగా వారి చిరకాల వాంఛ నెరవేరింది. బుధవారం ఆర్టీసీ బస్సు గ్రామంలోకి రాగా పండుగ వాతావరణం నెలకొంది.

సుద్దకుంటపల్లి గ్రామం జాతీయరహదారికి కేవలం 8 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. సుద్దకుంటపల్లి సమీపంలోని సుద్దకుంటపల్లి తండా గ్రామాల్లో వెయ్యిమందికి పైగా జనాభా ఉన్నారు. అయితే ఏళ్లుగా ఆ గ్రామానికి బస్సు సర్వీస్ లేకపోవడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడ్డారు. ఈ నియోజకవర్గం నుంచి మంత్రిగా పనిచేసిన వారికి విన్నవించుకున్నా ఏనాడూ పట్టించుకోలేదన్నారు. ఈ క్రమంలో ఇటీవల గ్రామానికి చెందిన ఓ వ్యక్తి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కార్యాలయానికి సమస్య చేరవేశాడు. దీంతో అధికారుల్లో కదలిక వచ్చింది. స్థానిక ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి చొరవ తీసుకోవడంతో బుధవారం ధర్మవరం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు గ్రామానికి వచ్చింది. ఇక నుంచీ రోజూ సర్వీసు నడుస్తుందని ఆర్టీసీ అధికారులు తెలిపారు. దీంతో గ్రామస్తుల్లో ఆనందోత్సాహాలు వెల్లువెత్తాయి. దశాబ్దాల కల నెరవేర్చిన ప్రభుత్వానికి సర్పంచ్ నరేంద్రతోపాటు గ్రామానికి చెందిన లక్ష్మీనాయక్, సూర్యనాయక్, వెంకటేష్ నాయక్, నర్సింహ నాయక్, హరి నాయక్, ఈశ్వరయ్య గౌడ్, గోపాల్‌రెడ్డి, నందారెడ్డి, బాలూ నాయక్, గోపాల్ నాయక్ తదితరులు కృతజ్ఞత తెలిపారు.

నేటి నుంచి జిల్లాలో ఎస్సీపీసీఆర్ పర్యటన

పుట్టపర్తి అర్బన్: రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ (ఎస్సీపీసీఆర్) ఈనెల 20, 21 తేదీల్లో జిల్లాలో పర్యటించనుంది. గోండు సీతారాం, ఆదిలక్ష్మి త్రిపర్ణ, బత్తుల పద్మావతి సభ్యుల బృందం 20వ తేదీ ఉదయం 10.30 గంటలకు కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ మాధవరెడ్డిని మర్యాద పూర్వకంగా కలవనున్నారు. బాలల పరిరక్షణకు అధికార యంత్రాంగం చేపట్టిన, చేపట్టబోతున్న అంశాలపై చర్చించనున్నారు. మధ్యాహ్నం 2.30 గంటలకు బాల్య వివాహాల నిర్మూలనపై పుట్టపర్తి ఎంపీడీఓ కార్యాలయంలో సీడీపీఓలతో, సాయంత్రం 4 గంటలకు బుక్కపట్నం డైట్ కళాశాలలో విద్యా హక్కు చట్టం-2009 ప్రకారం ఈ విద్యా సంవత్సరంలో ప్రైవేటు పాఠశాలల్లో కల్పించిన సీట్లపై ఎంఈఓలతో సమీక్షించనున్నారు. శుక్రవారం ఉదయం 10.30 గంటలకు హిందూపురంలో అంగన్‌వాడీ కేంద్రాల పనితీరును తెలుసుకుంటారు. 11.45 గంటలకు లేపాక్షిలోని కేజీబీవీ పాఠశాలను సందర్శించనున్నారు. మధ్యాహ్నం పుట్టపర్తి బాలసదన్ చేరుకొని అక్కడి పిల్లలు, సిబ్బందితో భేటీ కానున్నారు.

రేపు మడకశిరకు మంత్రి గుమ్మనూరు రాక



మడకశిర: ఈ నెల 21న రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరామ్ మడకశిరకు రానున్నారు. ఈ మేరకు స్థానిక ఎమ్మెల్యే తిప్పేస్వామి బుధవారం తెలిపారు. మడకశిర నియోజకవర్గ అభివృద్ధిపై శుక్రవారం ఉదయం 9 గంటలకు టీటీడీ కల్యాణమంటపంలో జరిగే సమీక్ష సమావేశంలో పాల్గొంటారన్నారు.

అనుమతి లేక అవస్థలు

- అనుమతులు లేవని శ్రీచైతన్య స్కూల్ సీజ్ చేసిన అధికారులు
- 'నారాయణ'లోనూ 8, 9, 10 తరగతుల రద్దుకు ఆదేశం
- ఫీజులు కట్టి మోసపోయామని విద్యార్థుల తల్లిదండ్రుల ఆవేదన

సాక్షి, పుట్టపర్తి: కొత్తచెరువు మండల కేంద్రంలోని శ్రీచైతన్య, నారాయణ పాఠశాలలు అనుమతుల్లేకుండానే తరగతులు నిర్వహిస్తుండగా, అధికారులు ఆయా పాఠశాలలపై చర్యలు తీసుకున్నారు. దీంతో ఫీజు చెల్లించిన విద్యార్థుల తల్లిదండ్రులు లబోదిబోమంటున్నారు.

నారాయణ...నారాయణ

అనుమతులు లేకుండానే నారాయణ పాఠశాలలో 8, 9, 10 తరగతులకు ప్రవేశాలు కల్పించారు. ఫీజులు కూడా కట్టించుకున్నారు. అయితే అనుమతులు లేవని విద్యా శాఖాధికారులు సీజ్ చేసి తరగతులు రద్దు చేయాలని ఆదేశించారు. దీంతో ఫీజులు కట్టి మోసపోయామని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కానీ త్వరలోనే అనుమతులు వస్తాయని ఎలాంటి.. ఆందోళన వద్దని పాఠశాలల నిర్వాహకులు నమ్మబలుకుతున్నారు. నారాయణ పాఠశాలకు ఏడో తరగతి వరకు మాత్రమే అనుమతులు ఉన్నాయి.

'శ్రీచైతన్య' సీజ్

కొత్తచెరువు సమీపంలో అనుమతులు లేకుండానే శ్రీచైతన్య విద్యాసంస్థల నిర్వాహకులు పదో తరగతి వరకు దాదాపు 800 మందికి అడ్మిషన్లు కల్పించారు. భారీగానే ఫీజులు వసూలు చేశారు. అయితే ఇప్పటికీ అనుమతులు రాలేదు. ఒకరిద్దరు ఈ విషయం తెలుసుకుని ప్రశ్నించగా... నేడో.. రేపో ఉత్తర్వులు వస్తాయని నిర్వాహకులు మాయమాటలు చెబుతున్నారు. అయితే ఇప్పటికే విద్యా శాఖాధికారులు శ్రీచైతన్య యాజమాన్యాన్ని పలుమార్లు హెచ్చరించారు. ఆదేశాలు బేఖాతరు చేయడంతో గత శనివారం పాఠశాలను సీజ్ చేశారు. అనుమతి పత్రాలు చూపించిన తర్వాతే తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. అప్పటి నుంచి పాఠశాలకు తాళం వేసి ఉంది. కానీ గత రెండు రోజులుగా తమ పాఠశాలకు విద్యాశాఖ నుంచి అనుమతులు వచ్చినట్లు నిర్వాహకులు సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారం చేస్తున్నారు. దీనిపై విద్యాశాఖ అధికారులను సంప్రదిస్తే.. అనుమతుల విషయం తమ దృష్టికి రాలేదని సమాధానం ఇచ్చారు.

టీకాల వివరాలు పక్కాగా నమోదు చేయండి

ప్రశాంతి నిలయం: చిన్నారులు, గర్భిణులకు వేసే టీకాలను ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు పక్కాగా నమోదు చేయాలని సంబంధిత సిబ్బందిని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్‌వీ కృష్ణారెడ్డి ఆదేశించారు. టీకా నమోదు వివరాలను యూ-విన్ యాప్‌లో నమోదు చేయడంపై మిషన్ ఇంద్రధనుస్సులో భాగంగా స్థానిక స్త్రీశక్తి భవన్‌లో బుధవారం పీహెచ్‌సీ వైద్యాధికారులకు ఒక్క రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ... మిషన్ ఇంద్రధనుస్సు కార్యక్రమం ఉద్దేశ్యాన్ని వివరించారు. క్షేత్ర స్థాయిలో సిబ్బంది వేసిన టీకాల వివరాలు పక్కాగా నమోదు చేయాలన్నారు. యాప్‌లో నమోదు చేసే విధానంపై శిక్షకుడు శివశంకర్, విజయ్ అవగాహన కల్పించారు.

పథకం ప్రకారమే వ్యక్తి హత్య

నల్లచెరువు: మండలంలోని బొమ్మిరెడ్డిపల్లికి చెందిన పవన్‌కుమార్ (35) హత్య కేసులో మిస్టరీ వీడింది. కర్ణాటక పోలీసుల దర్యాప్తును కుటుంబసభ్యులు బుధవారం వెల్లడించారు. బెంగళూరులోని ఓ ప్రైవేట్ పాఠశాల బస్సు డ్రైవర్‌గా పనిచేస్తున్న పవన్ కుమార్‌కు భార్యతో మనస్పర్థలు ఏర్పడి బిల్లాపురంలో ఒంటరిగా జీవించేవాడు.ఇదే అదునుగా భావించిన భార్య పార్వతి, యల్లప్ప అనే వ్యక్తితో వివాహేతర సంబంధం కొనసాగిస్తూ వచ్చింది. ఈ క్రమంలోనే ఎప్పటికైనా తన భర్త అడ్డుగా అవుతాడనే ఉద్దేశంతో పవన్‌కుమార్ హత్యకు పథకం వేసింది. ఇందులో భాగంగా ఈ ఏడాది మే 1న బిళ్లాపురంలో ఉంటున్న భర్త వద్దకు పార్వతి వెళ్లింది. మాయమాటతో కాఫీలో మత్తుమందు కలిపి ఇచ్చి స్పృహ కోల్పోయేలా చేసింది. ఆనంతరం యల్లప్పకు సమాచారం అందించి, అతని బొలెరో వాహనంలోనే హోసకోటెకు తీసుకెళ్లి పవన్‌కుమార్‌ను హత్య చేశారు. అనంతరం రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నంలో భాగంగా శ్రీనివాసపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని జాతీయ రహదారిపై మృతదేహాన్ని పడేసి బొలెరో వాహనంతో తొక్కించి ఉడాయించారు. ఘటనపై దర్యాప్తు చేపట్టిన కర్ణాటక పోలీసులు మూడు రోజుల పాటు మృతునికి సంబంధించిన బంధువులెవరూ రాకపోవడంతో అనాథ మృతదేహంగా భావించి దహన సంస్కారాలు చేసారు. మే 3న మృతుని కుటుంబ సభ్యులు రత్నమ్మ, భారతమ్మ, సునందమ్మ సర్జాపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో దర్యాప్తు మలుపు తిరిగింది. ఈ విషయం తెలుసుకున్న పార్వతి ఎవరికీ అనుమానం రాకుండా ఉండేందుకు తన భర్త కనిపించడం లేదంటూ మే 3, మిస్సింగ్ కేసు నమోదు చేయించింది. పోలీసులు తమదైన శైలిలో విచారణ చేయడంతో 79 రోజుల తర్వాత హత్య ఉదంతం బయట పడింది. ఈ కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలంటూ బాధిత కుటుంబసభ్యులు కోరారు.